సాక్షి విశాఖపట్నం

సోమవారం । 2 । సెప్టెంబర్ । 2024



ఇలా వద్దు..
హెల్మెట్ మరవద్దు 10లో



వర్షాలతో పలు రైళ్ల రద్దు

వర్షాల కారణంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలో పలు రైళ్లు రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. 10లో



బదిలీల 'పంచాయితీ'

పంచాయతీరాజ్ ఇంజినీర్ల బదిలీల ప్రక్రియ అక్రమాలకు నిలయంగా మారింది. మంత్రులు, ఎమ్మెల్యే సిఫార్సులకే పెద్దపీట వేశారు. 10లో

న్యూస్‌రీల్

నేడు పాఠశాలలు, కళాశాలలకు సెలవు



మహారాణిపేట: భారీ వర్షాల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా సోమవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాలలు, జూనియర్ కలశాలలు నిర్వహించవద్దని ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ మేరకు సంబంధిత జిల్లా అధికారులకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

మహారాణిపేట: భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను రద్దు చేసినట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

జీవీఎంసీలో..

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేసినట్లు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం రద్దయిందన్నారు.

ఏఎంసీ విద్యార్థినికి బంగారు పతకం



డాక్టర్ పుష్పితకు గోల్డ్ మెడల్ అందజేస్తున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కిశోర్ కుమార్

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీ రేడియాలజీ విభాగం విద్యార్థిని డాక్టర్ పుష్పిత గారపాటి డాక్టర్ కాకర్ల సుబ్బారావు స్మారక బంగారు పతకం, ధ్రువపత్రం అందుకున్నారు. నెల్లూరులో ఇండియన్ రేడియాలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ రాష్ట్ర పదో వార్షిక సమావేశాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఉత్తమ పరిశోధన పత్రం సమర్పించిన డాక్టర్ పుష్పిత ఆదివారం ఈ పతకాన్ని స్వీకరించారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రా మెడికల్ కాలేజీ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బుచ్చిబాబు ఆమెను అభినందిస్తూ.. రేడియాలజీ విద్యార్థులు చదువుతోపాటు పరిశోధన, నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కిశోర్ కుమార్, కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, డాక్టర్ సురేష్, వైజాగ్ రేడియాలజీ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కె.ఆర్.వర్మ తదితరులు డాక్టర్ పుష్పితను అభినందించారు.

మెరైన్ ఎస్పీగా రవివర్మ బాధ్యతలు



విశాఖ సిటీ: మెరైన్ ఎస్పీగా పి.వి.ఆర్.ఎస్.ఎస్.ఎస్.ఎం.వి. రవివర్మ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సీఐడీ విభాగంలో అదనపు ఎస్పీగా విధులు నిర్వర్తించిన ఈయనకు ఇటీవలే ఎస్పీ(నాన్ కేడర్)గా ప్రభుత్వం పదోన్నతి కల్పించి మెరైన్ ఎస్పీగా నియమించింది. దీంతో ఆయన వీఎంఆర్డీఏ కార్యాలయంలో ఉన్న మెరైన్ ఆఫీస్‌లో బాధ్యతలు చేపట్టారు.

జాబ్‌మేళాలు రేపు

డాబాగార్డెన్స్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 3న విశాఖ జిల్లాలో రెండు జాబ్‌మేళాలు నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా అధికారి సాయికృష్ణ చైతన్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెదగంట్యాడలోని నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్(నేక్), విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళాలు జరుగుతాయని చెప్పారు. పదో తరగతి నుంచి ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ చదివిన యువతీ యువకులు పాల్గొనవచ్చని తెలిపారు. పెదగంట్యాడ నేషనల్ అకాడమీ సెంటర్‌లో ఇన్నోసోర్స్, సెనర్జీస్ కాస్టింగ్, ఎయిర్‌టెల్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీలతో జాబ్‌మేళా ఉంటుందన్నారు. వివరాలకు 81217 43777 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో టెక్ విస్పెన్, డబ్ల్యూఎన్ఎస్, ఏటీసీ టైర్స్ కంపెనీలు జాబ్‌మేళా నిర్వహిస్తాయన్నారు. వివరాలకు 99669 65502 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులు గాజువాక, స్టీల్‌ప్లాంట్ ఏరియా, విశాఖపట్నం, అనకాపల్లి తదితర జిల్లాల్లో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

జనసేన ఎమ్మెల్యేలకు షాక్



- గన్‌మెన్‌ను వెనక్కు పంపించిన ఎమ్మెల్యే పంచకర్ల
- అదే బాటలో నేడు వంశీకృష్ణ కూడా...
- పోలీసు ఉన్నతాధికారి నుంచి స్పందన కరువు
- అవసరమైతే తనను మార్చుకోవచ్చని తేల్చిచెప్పిన ఆ అధికారి
- చేసేదేమీ లేక మిన్నకుండిపోయిన వైనం

పోస్టింగ్‌ల్లో టీడీపీ ప్రజాప్రతినిధులదే ఆధిపత్యం

జనసేన ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన సీఐలకు నో ఛాన్స్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం/విశాఖ సిటీ:

క్షవరం అయితే గానీ వివరం రాదు.. ఈ సామెత జనసేనకు కరెక్ట్‌గా సరిపోతుందన్న విషయం తాజాగా విశాఖలో సీఐ పోస్టింగుల వ్యవహారం చూసిన తర్వాత కలుగుతున్న అభిప్రాయం. ఇప్పటికే జీవీఎంసీ స్టాండింగ్ కమిటీలో కనీసం ఒక్క సీటు దక్కలేదని మండిపడుతున్న జనసేన నేతలకు తాజాగా సీఐల పోస్టింగుల్లోనూ అదే వివక్ష కొనసాగడంతో కక్కలేక మింగలేకపోతున్నారు. ప్రస్తుతం జిల్లాలో అధికారుల బదిలీల ప్రక్రియ కొనసా..గుతోంది. ఇప్పుడిదే కూటమిలో కుంపటి రాజేసింది. ఈ బదిలీల్లో కేవలం తెలుగుదేశం పార్టీ నేతల పెత్తనమే సాగుతోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న నలుగురు జనసేన ఎమ్మెల్యేల ప్రతిపాదనలను కనీసం పట్టించుకోకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. నిన్నమొన్నటి వరకు ఏ చిన్న సమావేశం, కార్యక్రమం జరిగినా రాసుకొని పూసుకొని తిరిగిన నేతలు.. ఇప్పుడు కారాలు మిరియాలు నూరుకుంటున్నారు. అయితే, తాము చెప్పిన వారికి పోస్టింగులు దక్కకపోవడంతో ఏకంగా తమ గన్‌మెన్లను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని నగర పరిధిలోని ఇద్దరు జనసేన ఎమ్మెల్యేలు నిర్ణయం తీసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. దీనిపై పోలీసు ఉన్నతాధికారితో మాట్లాడిన ఎమ్మెల్యేలకు చేదు సమాధానం రావడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. మరోవైపు తన పోస్టింగులు నచ్చకపోతే తననే మార్చుకోవచ్చంటూ పోలీసు ఉన్నతాధికారి సమాధానమివ్వడం వీరికి మింగుడుపడటం లేదని సమాచారం. దీంతో చేసేదేమీ లేక వెనక్కి పంపిన గన్‌మెన్‌ను తిరిగి పంచకర్ల చేర్చుకోగా.. సోమవారం గన్‌మెన్లను వెనక్కి పంపాలనుకున్న వంశీకృష్ణ ఏ నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాల్సి ఉంది.

టీడీపీ ఎమ్మెల్యేలు చెప్పిన వారికే..!

జిల్లాలో అన్ని శాఖల్లో బదిలీల ప్రక్రియ జరుగుతోంది. జాబితాలు సిద్ధమవుతున్నాయి. ఇందులో టీడీపీ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల సిఫార్సులకే ఉన్నతాధికారులు పెద్ద పీట వేస్తున్నారన్నది బహిరంగ రహస్యమే. జనసేన ఎమ్మెల్యేలు ఇచ్చిన లేఖలు బుట్టదాఖలు చేస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో పోలీస్ శాఖలో ఇప్పటికే కమిషనర్, ఎస్పీ, డీసీపీ, ఏడీసీపీ, ఏడీఎస్పీల నియామకాలు పూర్తయ్యాయి. ఈ పోస్టింగ్లో జనసేన ప్రజాప్రతినిధులను కనీసం పరిగణనలోకి కూడా తీసుకోలేదు. ఈ ప్రక్రియ అంతా చినబాబు కనుసన్నల్లోనే జరిగిందన్న టాక్ నడుస్తోంది. కనీసం స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్లను అయినా తమకు అనుకూలంగా ఉన్న వారిని, తెలిసిన వారిని నియమించుకోవాలని నలుగురు జనసేన ఎమ్మెల్యేలు భావించారు. వారి నియోజకవర్గంలో ఉన్న స్టేషన్లకు సంబంధించి కొంత మంది ఇన్‌స్పెక్టర్లకు సిఫార్సు లేఖలు సైతం ఇచ్చారు. అయితే ఇందులో ఒక్కరికి కూడా పోస్టింగ్ లభించకపోవడంతో ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు.

'కాపు' కాసిన వారికే వెన్నుపోటు

చంద్రబాబుకు అధికారం దక్కడం కోసం 'కాపు' కాసిన వారికే వెన్నుపోటు పొడుస్తున్నారన్న చర్చ ఆ సామాజిక వర్గంలో జోరుగా సాగుతోంది. ఉమ్మడి విశాఖలో కాపు సామాజిక వర్గానికి చెందిన ఒకరికి కూడా చంద్రబాబు మంత్రి పదవి ఇవ్వలేదు. కనీసం అధికారుల బదిలీల్లో అయినా కాపు సామాజిక వర్గానికి చెందిన వారికి ప్రాధాన్యత ఇస్తారని భావించారు. కానీ ఆ వర్గానికి చెందిన వారిని పూర్తిగా పక్కనపెడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల విషయాన్ని పక్కనపెడితే.. ఉమ్మడి విశాఖ జిల్లాలో చాలా మంది కాపు సామాజిక వర్గానికి చెందిన ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వారిలో కేవలం ఇద్దరికి మాత్రమే మైదాన ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చినట్లు తెలుస్తోంది. కనీసం జనసేన ఎమ్మెల్యేల సిఫార్సు చేసిన కాపు సీఐలను కూడా పక్కన పెట్టడం గమనార్హం. దీంతో ఆ సామాజిక వర్గానికి చెందిన వారు మదనపడుతున్నారు.

పంచకర్ల గన్‌మెన్ సరెండర్!



సీఐల బదిలీల విషయంలో జనసేన ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, కొణతాల రామకృష్ణ, సుందరపు విజయ్ కుమార్‌లు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. యలమంచిలిలో సుందరపు విజయ్ కుమార్ సిఫార్సు చేసిన నలుగురిలో ఒకరికి మాత్రమే పోస్టింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో హోం మంత్రి వ్యవహారంపై ఆయన బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నట్లు తెలుస్తోంది. మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో. పోస్టింగులన్నీ టీడీపీ నేతల ప్రతిపాదనలకే ప్రాధాన్యత కల్పించడం హాట్ టాపిక్‌గా మారింది. పంచకర్ల, వంశీకృష్ణ, కొణతాల లేఖలను కనీసం పరిగణనలోకి కూడా తీసుకోలేదు. జనసేన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో టీడీపీ నేతల పెత్తనమే సాగుతుండడం చర్చనీయాంశమవుతోంది. ఇదిలా ఉంటే.. కనీసం సీఐ పోస్టింగ్‌ల విషయంలో కూడా తమకు ప్రాధాన్యత కల్పించకపోవడంపై పెందుర్తి జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. శుక్ర, శనివారాల్లో జరిగిన సీఐల బదిలీల్లో తాను చెప్పిన ఒక్కరికీ కూడా చోటు కల్పించకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. దీంతో తన గన్‌మెన్‌ను సరెండర్ చేస్తూ ఆదివారం ఉదయం నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయంపై పోలీసు ఉన్నతాధికారితో మాట్లాడగా.. కనీసం స్పందన లేదని ఆయన అవమానంతో రగిలిపోయినట్లు తెలుస్తోంది. అవసరమైతే తననే మార్చుకోవాలంటూ ఆ అధికారి నుంచి సమాధానం రావడంతో చేసేదేమీ లేక తిరిగి గన్‌మెన్‌ను వెనక్కి పిలిపించుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కూడా ఈ సీఐల బదిలీల్లో తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. ఆయన సిఫార్సులను కూడా పట్టించుకోకపోవడంతో సోమవారం తన గన్‌మెన్‌ను సరెండర్ చేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

'స్థానిక'ంగాను చిన్నచూపే..

జనసేన భాగస్వామ్యం కారణంగానే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని జనసైనికులు బలంగా విశ్వసిస్తున్నారు. ఈ ప్రభుత్వంలో జనసేన నేతలకు మంచి గుర్తింపు ఉంటుందని భావించారు. స్థానిక సంస్థల్లోను, నామినేటెడ్ పదవుల్లోను కనీసం 30 శాతం పోస్టులు వరిస్తాయని గంపెడాశలు పెట్టుకున్నారు. కానీ అందుకు విరుద్ధంగా వాస్తవ పరిస్థితులు కనిపిస్తుండడంతో టీడీపీ నేతలపై మండి పడుతున్నారు. ఇటీవలే జీవీఎంసీ స్థాయి సంఘం ఎన్నికలు జరిగాయి. జనసేన పార్టీకి ముగ్గురు కార్పొరేటర్లు ఉండగా.. మరో అయిదుగురు వైఎస్సార్ కాంగ్రెస్ నుంచి చేరడంతో వారి బలం ఎనిమిదికి పెరిగింది. దీంతో ఆ స్టాండింగ్ కమిటీలో ఒకరికైనా సభ్యుడిగా అవకాశం వస్తుందని భావించారు. అయితే జనసేన కార్పొరేటర్ పేరు ప్రతిపాదన కూడా చేయకపోవడంతో ఖంగుతిన్నారు. అయినప్పటికీ టీడీపీ నుంచి పోటీ చేసిన 10 మంది సభ్యులకు ఓటేసి గెలిపించారు. కనీసం స్టాండింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయాల్లో అయినా ప్రాధాన్యత కల్పిస్తారని భావించినప్పటికీ.. ఆ పరిస్థితి కనిపించడం లేదు. దీంతో జీవీఎంసీలోను జనసేన కార్పొరేటర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

విమ్స్‌లో మందుల కొరత



ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో మందుల కొరత ఏర్పడింది. గత ఐదేళ్లలో రోగులకు పూర్తిస్థాయిలో మందులు అందగా.. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ప్రభుత్వం మారిన వెంటనే ఇక్కడ నిర్వహణలో మార్పులొచ్చాయి. కొన్ని వ్యాధుల నివారణకు సంబంధించిన మాత్రలు, ఇంజక్షన్లు, సిరప్‌లు ప్రస్తుతం అందుబాటులో లేవు. ప్రధానంగా జనరల్, న్యూరో, పల్మనాలజీ తదితర విభాగాలకు సంబంధించిన ఉడిలివ్, పల్మోక్లియర్ మాత్రలు, సిట్రాల్కా, సర్కాలోఫేట్, కేసీఎల్ సిరప్‌లు, పిప్జో 4.5, ఎంపీఐ ఇంజక్షన్ల కొరత ఉంది. దీంతో రోగులు బయట మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఉచితంగా మందులు ఇస్తారనుకుంటే.. డబ్బులు పెట్టి కొనాల్సి వస్తుందని రోగులు, వారి బంధువులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు వైద్యాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రెండు రోజుల కిందట రాత్రి డ్యూటీలో ఉన్న నర్సింగ్ సిబ్బంది నిర్లక్ష్యంతో న్యూరో సర్జరీ జరిగిన ఇద్దరు రోగుల పరిస్థితి విషమంగా మారింది. ఈ వ్యవహారంపై అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అధికారులు పట్టించుకోకపోవడం వల్లే నర్సింగ్ సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. రాత్రులు పర్యవేక్షించాల్సిన సీఎంవో(కాజువాల్టీ మెడికల్ ఆఫీసర్) కనిపించడం లేదు.

ఫ్రీ హోల్డ్ భూములకు బ్రేక్

- పట్టాల జారీ, రిజిస్ట్రేషన్లు నిలిపివేత
- గగ్గోలు పెడుతున్న పట్టాదారులు
- గత ప్రభుత్వం హయాంలో 100 ఎకరాలకు రిజిస్ట్రేషన్
- ఇప్పుడు అన్నింటినీ పెండింగ్‌లో పెట్టిన కూటమి ప్రభుత్వం

మహారాణిపేట: డి-పట్టా భూములకు హక్కులు కల్పించేందుకు జగనన్న ప్రవేశపెట్టిన ఫ్రీ హోల్డ్ భూముల సర్టిఫికెట్ల జారీకి బ్రేకు పడింది. పేదల అభ్యున్నతికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పథకాన్ని కూటమి ప్రభుత్వం నీరు గారుస్తోంది. ఈ పథకం కింద డి-ఫారం పట్టాదారులకు భూహక్కులు కల్పించి, వారి పేరున రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియను, ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్ల జారీని కూటమి సర్కార్ నిలుపుదల చేసింది. దీంతో జిల్లాలో ఎక్కడికక్కడ ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్ల జారీ, రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. డి-పట్టా భూములకు హక్కులు కల్పించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవో నంబర్ 596ను జారీ చేసింది. 2002కు ముందు ఉండే డి-పట్టా భూములు తీసుకున్న వారికి అన్ని హక్కులు కల్పించడం కోసం ప్రత్యేకంగా జీవో ఇచ్చారు. దీని వల్ల పట్టాదారునికి హక్కులు కల్పించడంతో పా టు రిజిస్ట్రేషన్ చేశారు. దీని వల్ల ఆ పట్టాదారుడికి భూమి సొంతం అవుతుంది. ఆ తర్వాత జీవనాధారం కోసం ఆ భూమిని అమ్ముకోవడానికి కూడా అనుమతి ఇచ్చారు.

భూముల వివరాలు : జిల్లాలో మొత్తం 609 ఎకరాల భూమి డి-పట్టాల కింద ఉన్నట్టు గుర్తించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అర్హులకు హక్కులు కల్పించడం, రిజిస్ట్రేషన్ చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఆనందపురం మండలంలో 407.77 ఎకరాలు, పద్మనాభంలో 129.60 ఎకరాలు, పెందుర్తిలో 20.04 ఎకరాలు, భీమిలిలో 52.51 ఎకరాల భూమి ఉన్నట్టు గుర్తించారు. వీటికి విచారణ చేసి సర్టిఫికెట్లు ఇచ్చారు.




జిల్లా కలెక్టర్ కార్యాలయం

వీటిలో 100 ఎకరాల పైబడిన భూమికి రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయి. అయితే ఇప్పుడు వివిధ సాంకేతిక కారణాలు చూపుతూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలుపుదల చేశారు. మొత్తం ఫ్రీ హోల్డ్ భూములపై విచారణ చేస్తున్నట్టు జిల్లా అధికారి తెలిపారు.

గగ్గోలు పెడుతున్న బాధితులు : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్ది రోజులకే ఫ్రీ హోల్డ్ పట్టాల జారీ నిలుపుదల చేశారు. ఈ పట్టాల జారీపై పట్టాదారులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పట్టాల జారీ మధ్యంతరంగా నిలుపుదల చేయడం పట్ల వారు నిరసన వ్యక్తం చేస్తున్నారు. విచారణ పేరిట ఈ ప్రక్రియను నిలుపుదల చేయడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం పునఃపరిశీలన తమను చేసి ఆదుకోవాలని వారు కోరారు.

గుర్తుకొస్తున్నాయి..



వైఎస్సార్.. ఆ పేరు ఓ ప్రభంజనం. నవ్వులో స్వచ్ఛత.. పిలుపులో ఆత్మీయత.. మాట తప్పని, మడమ తిప్పని గుణంతో ఆయన ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ప్రపంచీకరణ విధానాల యుగంలో అభివృద్ధి, సంక్షేమాలను సమపాళ్లలో మేళవించి చూపిన మహోన్నత నాయకుడు వైఎస్సార్. మహానేతను కోల్పోయి 15 ఏళ్లు గడిచిపోయాయి. కానీ ఆ జ్ఞాపకాలు చెరిగిపోలేదు.. ఆ రూపం చెదిరిపోలేదు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా విశాఖలో మహానేత చేపట్టిన అభివృద్ధి.. సంక్షేమాన్ని గుర్తు చేసుకుందాం.. – సాక్షి, విశాఖపట్నం/పెందుర్తి

- ఉమ్మడి విశాఖ జిల్లాపై చెరగని ముద్ర వేసిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి
- చరిత్ర గతిని మార్చిన మహనీయుడు
- నేడు వైఎస్సార్ వర్ధంతి

ఉమ్మడి విశాఖ జిల్లాలో 2004–2009 మధ్యలో జరిగిన అభివృద్ధి గతంలో ఎన్నడూ జరగలేదు. పెండింగ్ ప్రాజెక్టులకు పునరుజ్జీవం పోయడం, విశాఖ కార్పొరేషన్‌ను గ్రేటర్‌గా మార్చడం, లక్షలాది మంది సొంతింటి కలను సాకారం చేయడం, పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించడం, నగరంలో ఉన్న దాదాపు అన్ని పరిశ్రమలకు చేయూతనిచ్చి కార్మికులకు అండగా నిలవడంలో మహానేత తన ముద్ర చూపారు. సాధారణ కార్పొరేషన్‌గా ఉన్న విశాఖ నగరాన్ని గాజువాక, మరో 32 పంచాయతీలను విలీనం చేసి 72 వార్డులతో 2005లో జీవీఎంసీగా మార్పు చేశారు. దేశంలో జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం అమలైన 63 నగరాల్లో వైజాగ్‌ని చేర్చిన ఘనత వైఎస్సార్‌దే. ఈ ప్రాజెక్ట్ ద్వారా రూ.1,500 కోట్లతో నగరంలో భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టారు. భాగ్యనగరానికి దీటుగా రూ.456 కోట్లు వెచ్చించి బీఆర్‌టీఎస్ రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. మధురవాడలోని మూడు కొండల మధ్య 300 ఎకరాల విస్తీర్ణంలో సెజ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

దాహార్తి తీర్చింది ఆయనే..

ఎండాడ ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.23 కోట్లు.. నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు తాటిపూడి నుంచి నగరానికి రూ.95కోట్లతో పైపులైన్ ఏర్పాటు చేయించారు. ఆశీల్‌మెట్ట నుంచి రైల్వేస్టేషన్ వరకు రూ.87 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మించారు. విశాఖ ఎయిర్ పోర్టుకు అంతర్జాతీయ హోదా తీసుకొచ్చిన ఘనత వైఎస్‌దే. విమ్స్ ఆస్పత్రికి శ్రీకారం చుట్టింది ఆయనే.

ఉచిత విద్యుత్ వెలుగులు

జిల్లా వ్యాప్తంగా 25 వేల వ్యవసాయ సర్వీసులకు ఇప్పటికీ ఉచిత విద్యుత్ అందుతుంది అంటే అది కేవలం వైఎస్సార్ చలవే. రైతులకు రుణమాఫీ చేశారు. మాఫీ వర్తించని జిల్లాలోని 55 వేల మంది రైతులకు రూ.5వేలు చొప్పున ప్రోత్సాహకం అందించారు.

అక్కచెల్లెమ్మలకు పావలా వడ్డీ

వైఎస్సార్ అధికారం చేపట్టడానికి ముందు డ్వాక్రా రుణాలకు 14 శాతం వడ్డీ వసూలు చేసేవారు. వారికి అండగా నిలవాలన్న సంకల్పంతో వడ్డీ శాతాన్ని 4 శాతానికి(పావలా) తగ్గించి మహిళల జీవితాల్లో వెలుగులు నింపారు. ఆయన పాలించిన ఐదేళ్ల కాలంలో సుమారు రూ.1000 కోట్లకు పైగా పావలా వడ్డీ రుణాలను డ్వాక్రా మహిళలు పొందారు.

మూడున్నర లక్షల మందికి గూడు

ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా దాదాపు 3,56,115 మందికి సొంత ఇంటి కలను సాకారం చేసిన ఘనత వైఎస్సార్‌ది. పార్టీలు, ప్రాంతాలు, కులాలు, మతాలతో పనిలేకుండా కేవలం అర్హతను మాత్రమే ప్రామాణికంగా తీసుకుని ప్రజలకు ఇళ్లు కట్టించారు. నగరంలో కూడా పునరావాస, పూర్‌సెటిల్‌మెంట్ కాలనీలను నిర్మించారు. ఇలా నగరంలో దాదాపు లక్ష మందికి సొంత గూడు కల్పించారు.

గోదావరి నీరు మళ్లింపు

గోదావరి నీటిని విశాఖతో పాటు ఉత్తరాంధ్ర తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలకు వినియోగించే సంకల్పంతో పోలవరం ఎడమ కాలువను నిర్మించారు. తాండవ, రైవాడ, పెద్దేరు, కోనాం ప్రాజెక్టుల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. ఏలేరు నీటిని మళ్లించి స్టీల్‌ప్లాంట్ నీటి సమస్యను తీర్చారు. సబ్బవరం కేంద్రంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి నిర్మాణానికి వైఎస్సార్ పునాది రాయి వేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే వైఎస్సార్ చేసిన అభివృద్ధి చాంతాడంత.



పినగాడిలో తొలి దశ ఇందిరమ్మ గృహాలకు శ్రీకారం చుడుతున్న వైఎస్సార్(ఫైల్)

స్టీల్‌ప్లాంట్ విస్తరణ వైఎస్ చలవే..

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేట్ పరమయ్యే స్థితికి చేరుకున్న దశలో వైఎస్సార్ ఆ ప్రక్రియను సమర్థవంతంగా ఆపగలిగారు. పరిశ్రమకు చేయూతనివ్వడంతో పాటు ఆనాడు కేంద్రంతో పోరాటం చేసి ప్లాంట్ విస్తరణకు శ్రీకారం చుట్టారు. తద్వారా విశాఖ ఉక్కు పరిశ్రమ ఉత్పత్తిని రెట్టింపు చేసుకుంది. మూతపడిపోతున్న బీహెచ్ఈఎల్‌ను బీహెచ్‌పీవీలోకి విలీనం చేయించారు. అదే స్థితిలో ఉన్న షిప్‌యార్డును నేవీలో విలీనం చేయించారు. ఎన్టీపీసీ, హెచ్‌పీసీఎల్ విస్తరణకు పునాదులు వేశారు. అచ్యుతాపురంలో ఇండస్ట్రియల్ కారిడార్, మధురవాడలో ఐటీ కారిడార్, పరవాడ ఫార్మాస్యూటికల్ కారిడార్, దువ్వాడ ఐటీ సెజ్ ఇలా ఎన్నో పరిశ్రమలు వైఎస్సార్ పాలనలో ఉమ్మడి విశాఖ సిగలో ఒదిగాయి.



విస్తృతంగా సేవా కార్యక్రమాలు



మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పిలుపునిచ్చారు. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదల ఆశాజ్యోతి వైఎస్సార్ అని, ఆయన వర్ధంతి సందర్భంగా నాయకులు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, అన్న సమారాధనలు నిర్వహించాలని కోరారు. పార్క్ హోటల్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి నిర్వహణలో రాష్ట్ర నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పిస్తారని తెలిపారు.

జెడ్పీకి 120కి పైగా సిఫార్సులు

- జిల్లా పరిషత్‌లో బదిలీలకు పైరవీలు
- మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ అధికారుల ప్రదక్షిణ

మహారాణిపేట: జిల్లా పరిషత్ పరిధిలోని పంచాయతీరాజ్‌లో ఉద్యోగ బదిలీలకు జోరుగా పైరవీలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు ఎమ్మెల్యేలు, మంత్రుల నుంచి 120 సిఫార్సు లేఖలు జిల్లా పరిషత్ కార్యాలయానికి అందాయి. బదిలీలకు ఇంకా గడువు ఉండటంతో ఈ లేఖల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. జెడ్పీ పరిధిలో పంచాయతీరాజ్ శాఖలో ఉమ్మడి విశాఖ జిల్లా కేంద్రంగా బదిలీలు నిర్వహించడానికి పెద్ద ఎత్తున కసరత్తు జరుగుతోంది. ఇక్కడ జెడ్పీ సీఈవో ఓ మంత్రి వద్ద ఓఎస్డీగా వెళ్లారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఇన్‌చార్జితో నడుస్తోంది. ఈ పోస్టుకు ఇద్దరు అధికారులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా తమ వారిని ఈ పోస్టులో నియమించుకోవడానికి పైరవీలు చేస్తున్నట్లు వినికిడి. దీంతో పాటు ఎంపీడీవోల పోస్టు కోసం కూడా ముమ్మరంగా పైరవీలు సాగుతున్నాయి. కార్యాలయ సూపరింటెండెంట్ల పోస్టుల కోసం ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల గడువు ఈనెల 15 వరకు పెంచిన విషయం తెలిసిందే.

పోస్టుల వివరాలు

జిల్లాలో ఐదు ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉండగా, 8 మంది ఎంపీడీవోలకు అయిదేళ్లు పూర్తి కావడంతో వారిని తప్పనిసరిగా బదిలీ చేయాల్సి ఉంది. ఈ పోస్టుల కోసం 12 మంది ఎంపీడీవోలు రిక్వెస్టు లెటర్లు తెచ్చారు. వీటికి ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు జత చేశారు. ఇతర జిల్లాల నుంచి 9 మంది ఎంపీడీవోలు విశాఖ రావడానికి ప్రయత్నం చేస్తున్నారు. వీరు కూడా ఎమ్మెల్యేల లేఖలు జత చేశారు. అలాగే 90 మందికి పైగా ఇతర మినిస్టీరియల్ స్టాఫ్‌కు కూడా బదిలీలు జరిగే అవకాశం ఉంది. వారు కూడా పోస్టుల కోసం పైరవీలు చేస్తున్నారు.

అరకొర పంచదార విడుదల

మహారాణిపేట: రేషన్ కార్డుదారులకు ఈనెల అరకొర పంచదార విడుదల చేశారు. జిల్లాలో 5,12,619 తెలుపు కార్డుదారులు ఉన్నారు. జిల్లాలో 625 చౌకధరల డిపోలున్నాయి. రెండు నెలల నుంచి పంచదార కోటా కేటాయింపులు లేవు. సెప్టెంబర్ నెల కింద అరకొర కేటాయింపులు చేశారు. జిల్లాకు 120 మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించారు. దీంతో సగం కార్డుదారులకు మాత్రమే పంచదార అందే పరిస్థితి ఉంది. మిగిలిన కార్డుదారుల కోసం మరో 115 మెట్రిక్ టన్నుల అవసరం ఉంది. అదనపు కేటాయింపుల కోసం ఎలాంటి సమాచారం లేదని అధికారులు చెబుతున్నారు. వచ్చిన కేటాయింపులను ఫస్టు కమ్ ఫస్టు సర్వ్ కింద పంచదారను డీలర్లు తీసుకుంటున్నారు. కార్డుదారునికి అర కిలో పంచదారను రూ.17కు సరఫరా చేస్తున్నారు. ఇదిలావుండగా తూకంలో కూడా తేడాలొస్తున్నాయని కార్డుదారులు ఆరోపిస్తున్నారు.

ఎస్ఐపై దాడి చేసిన రౌడీషీటర్ అరెస్ట్

అతనికి సహకరించిన మరో వ్యక్తి కూడా..

అల్లిపురం: విధి నిర్వహణలో ఉన్న మహారాణిపేట ఎస్ఐపై దాడికి పాల్పడిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి ర్యాపిడో డ్రైవర్ ఒకరు నోవాటెల్ హోటల్ రోడ్లో వెళ్తున్నాడు. ఆ సమయంలో అక్కడే గల టీప్ బార్ అండ్ రెస్టారెంట్ నుంచి బయటికి వస్తున్న వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ సింగంపల్లి సత్యం.. తన భార్యను చూసాడన్న నెపంతో స్నేహితుడు గురునాథ్‌తో కలసి ర్యాపిడో డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు డయల్ 100కు ఫోన్ చేశాడు. విషయం తెలుసుకున్న మహారాణిపేట ఎస్ఐ అప్పలనాయుడు సిబ్బంది సాయిరాం, శివతో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లారు. వారితో వాగ్వాదానికి దిగిన సత్యం, అతని స్నేహితుడు గురునాథ్‌తో కలిసి దాడికి దిగాడు. దీంతో వారిపై కేసు నమోదు చేసిన పోలీసులు వారిని అరెస్ట్ చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.73,040
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.66,950
వెండి(కిలో):	రూ.92,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.111
స్కిన్	: రూ.192
స్కిన్‌లెస్	: రూ.202





ఇలా వద్దు.. హెల్మెట్ మరవద్దు





నగర పోలీసులు విస్తృతంగా హెల్మెట్ డ్రైవ్ నిర్వహిస్తున్నప్పటికీ.. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్లు ధరించకుండా రోడ్లపై తిరుగుతున్నారు. నగరంలో ఆదివారం నుంచి బైక్‌పై వెళ్లే ఇద్దరూ హెల్మెట్లు ధరించాలని నిబంధన విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో డాబాగార్డెన్స్ వద్ద ఆదివారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కొంత మంది వాహనచోదకులు హెల్మెట్లు తీసుకొచ్చినప్పటికీ ధరించకుండా ఉండటం గుర్తించారు. మరికొందరు పోలీసులను చూసి హెల్మెట్లు ధరించారు. కొంతమంది తల్లిదండ్రులు పిల్లలకు మాత్రమే హెల్మెట్ ధరించి.. తాము ధరించకుండా బైక్ నడుపుతున్నారు. ఇలాంటి వారికి పోలీసులు జరిమానాలు విధించారు.

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



పోలీస్ కదా.. వదిలేయ్!



ఒకవైపు హెల్మెట్ ధరించని వారికి పోలీసులు చలాన్లు వేస్తుంటే.. మరోవైపు ఆ పోలీసే హెల్మెట్ లేకుండా వాహనాన్ని నడుపుతుండడం గమనార్హం. హెల్మెట్ లేని వాహనచోదకుల నుంచి రూ.1,035ను చలానా రూపంలో వసూలు చేయగా.. ఈ పోలీస్‌ను మాత్రం వదిలేశారు. నిబంధనలు, చట్టాలు సాధారణ ప్రజలకే.. వాటిని అమలు చేసే వారికి కావేమో.!

వర్షాలతో పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలో పలు చోట్ల ట్రాక్‌లు కొట్టుకుపోవడం, రాయనపాడు రైల్వే స్టేషన్‌లో వరద నీరు చేరడంతో పలు రైళ్లు రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

ఆదివారం రద్దయిన రైళ్లు

విశాఖపట్నం–సికింద్రాబాద్(20708) వందేభారత్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–షాలిమర్(18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–హౌరా(12704)ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–మహబూబ్‌నగర్–విశాఖపట్నం(12861/62) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–హైదరాబాద్(12727/28) గోదావరి ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–సికింద్రాబాద్(12739/40) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం– లోకమాన్య తిలక్ టెర్మినస్(18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్

2వ తేదీన రద్దయిన రైళ్లు

నాందేడ్–సంబల్‌పూర్(20810) నాగావళి ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–విశాఖపట్నం(20707/08) వందేభారత్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–సికింద్రాబాద్(20833/34) వందేభారత్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–మచిలీపట్నం(17220) ఎక్స్‌ప్రెస్, విజయవాడ–విశాఖపట్నం–విజయవాడ(12717/12718)రత్నాచల్ ఎక్సప్రెస్, హౌరా–సికింద్రాబాద్(12703)ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, హౌరా–ఎస్ఎంవీ బెంగళూరు(22863) ఎక్స్‌ప్రెస్, షాలిమర్–హైదరాబాద్(18045)ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, టాటానగర్–ఎర్నాకుళం(18189) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–తిరుపతి(22707)డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ – షాలిమర్ (12842) కోరమండల్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–హైదరాబాద్(12727) గోదావరి ఎక్స్‌ప్రెస్, విశాఖ–మహబూబ్‌నగర్–విశాఖ (12861/62) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–గుంటూరు (22701)ఉదయ్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–లింగంపల్లి(12805)జన్మభూమి ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–కడప(17488) తిరుమల ఎక్స్‌ప్రెస్, విశాఖ–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(22869) ఎక్స్‌ప్రెస్, సంబల్‌పూర్–నాందేడ్(20809) ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–సికింద్రాబాద్(17015)విశాఖ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–బెంగళూరు(18463)ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–ముంబయి(11020)కోణార్క్ ఎక్స్‌ప్రెస్

3వ తేదీన రద్దయిన రైళ్లు

విజయవాడ–విశాఖ–విజయవాడ (12717/12718) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, హౌరా–సికింద్రాబాద్ (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, లోకమాన్య తిలక్ టెర్మినస్–విశాఖపట్నం(18520) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్, షాలిమర్ – ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(12841) కోరమండల్ ఎక్స్‌ప్రెస్.

5, 6వ తేదీ వరకు రద్దయిన రైళ్లు

గుంటూరు–విశాఖపట్నం(17239)సింహాద్రి ఎక్స్‌ప్రెస్ 5వ తేదీ వరకు, విశాఖపట్నం–గుంటూరు (17240)సింహాద్రి ఎక్స్‌ప్రెస్ 6వ తేదీ వరకు రద్దు చేశారు. గుంటూరు–రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్ 5వ తేదీ వరకు, రాయగడ–గుంటూరు(17244) ఎక్స్‌ప్రెస్ 6వ తేదీ వరకు రద్దు చేశారు.

గమ్యం కుదించిన రైళ్లు

ఆదివారం సంబల్‌పూర్‌లో బయల్దేరిన సంబల్‌పూర్–నాందేడ్(20809) నాగావళి ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం వరకు మాత్రమే నడిచింది.

దారి మళ్లించిన రైళ్లు

విశాఖ–న్యూఢిల్లీ–విశాఖ(20805/06) ఏపీ ఎక్స్‌ప్రెస్, పూరీ–ఓఖా(20819) ఎక్స్‌ప్రెస్, విశాఖ–హజరత్ నిజాముద్దీన్– విశాఖ(12803/04) స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ –ముంబయి (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–షాలిమర్–హైదరాబాద్(18045/46) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, లోకమాన్య తిలక్ టెర్మినస్– విశాఖపట్నం(18520)ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్, ముంబయి–భువనేశ్వర్(11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్.

షిప్‌కి క్రేన్ ఎర



వామ్మో.. కంటైనర్స్‌తో వచ్చిన షిప్‌ని లాగేసేంత.. పే....ద్ద క్రేన్ వైజాగ్ వచ్చిందా అని అనుకుంటున్నారు కదా.. ఇది చిత్రం.. భళారే విచిత్రమిది. ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు చేస్తున్న సమయంలో వచ్చిన ఓ క్రేన్ తన పనిలో నిమగ్నమై ఉండగా.. అదే సమయంలో కంటైనర్ టెర్మినల్‌కి ఈ భారీ షిప్ వస్తోంది. ఈ సమయంలో 'సాక్షి' కెమెరా ఇలా ఆ షిప్‌కే క్రేన్ ఎరవేసినట్లుగా క్లిక్‌మనిపించింది.

ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

హరిత హారం కాదు.. మృత్యు ద్వారం



పచ్చదనం పరుచుకున్న రహదారి.. ఇపుడు మృత్యు ద్వారంలా మారింది. డాబాగార్డెన్స్ నుంచి సంగంశరత్ రోడ్డు మధ్యలో రహదారికి ఇరువైపులా ఇష్టాను సారంగా వేసిన వైర్లు ఇపుడు ప్రమాదకరంగా మారాయి. ఆ వైర్లకు పాదులు అల్లుకున్నాయి. దాని బరువు ఎక్కువవడంతో కిందకు జారిపోయాయి. దీంతో ఆ రోడ్డులో వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ఆ వైర్లు తగిలి పడిపోయే ప్రమాదం ఉంది.

–ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

రైల్వేస్టేషన్‌లో హెల్ప్‌డెస్క్‌లు



విశాఖలో ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్

తాటిచెట్లపాలెం: వర్షాల కారణంగా పలు రైళ్లు రద్దయ్యాయి.. ఈ సమాచారాన్ని ప్రయాణికులకు తెలియజేసేందుకు విశాఖ రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటుచేశారు. రిజర్వేషన్ ప్రయాణికులకు టికెట్ రద్దు చార్జీలను వెనక్కించేందుకు నాలుగు రిఫండ్ కౌంటర్లు, సమాచారం కోసం మూడు కౌంటర్లు అందుబాటులో ఉంచారు. రైల్వేస్టేషన్‌లో సమాచారం కోసం 0891–2746330 / 2744619 నెంబర్లు ఏర్పాటు చేశారు. విజయనగరం, శ్రీకాకుళంరోడ్‌లో కూడా హెల్ప్‌డెస్క్‌లను, సమాచార కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారుల తెలిపారు.

బదిలీల 'పంచాయితీ'



జిల్లా పరిషత్ కార్యాలయం

ఇంజినీర్లను ఏకపక్షంగా.. తోచినట్లు బదిలీ చేసి పంచాయతీరాజ్ శాఖ అపవాదు మూటగట్టుకుంది. పర్యవేక్షణ లేకపోవడంతో ఎవరికి నచ్చిన స్థానాలను వారే ఎంపిక చేసుకుని పోస్టింగులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారని సమాచారం. ఈ బదిలీల్లో మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసులకు పెద్దపీట వేసినట్లు వినికిడి. ఈ వ్యవహారంలో కొందరికి మేలు, మరి కొందరికి అన్యాయం జరిగినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బదిలీల ప్రక్రియను 15 రోజులు వాయిదా వేయడంతో కొంత మంది ఊపిరి పీల్చుకున్నారు.

- మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులకు పెద్దపీట
- డబ్బులు చేతులు మారినట్లు తీవ్ర ఆరోపణలు

మహారాణిపేట : పంచాయతీరాజ్ ఇంజినీర్ల బదిలీల ప్రక్రియ అక్రమాలకు నిలయంగా మారింది. ఈనెల 27న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలోని ఎస్ఈలకు కౌన్సెలింగ్ నిర్వహించి ఒక జాబితా తయారు చేశారు. రాత్రి పది గంటల వరకు మొత్తం ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో బదిలీల కథ నడిపారు. ఈ జాబితా ప్రకారమే బదిలీలు జరుగుతాయని నమ్మబలికారు. అందులోను ఆ శాఖ ఉన్నతాధికారులు రావడం, జిల్లా అధికారుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించటంతో బదిలీలు సక్రమంగా జరుగుతున్నయని ఉద్యోగులు భావించారు. అయితే జీవో 75ను పక్కన పెట్టి మరీ అధికారులు జాబితా సిద్ధం చేయడం, డబ్బులు తీసుకుని ఎవరికి కావాల్సిన ప్రాంతానికి వారిని బదిలీ చేస్తూ ప్రతిపాదనలు తయారు చేయడంతో షాక్‌కు గురయ్యారు.

జీవో 75 బుట్టదాఖలు

బదిలీల్లో జోన్–1 పరిధికి చెందిన ఒక సూపరింటెండెంట్‌కు మేలు చేసేందుకు అధికారులు ప్రభుత్వ జీవోనే బుట్ట దాఖలు చేశారు. భారీగా ముడుపులు తీసుకోవడమే దీనికి కారణమని తెలుస్తోంది. అయితే అధికారులను అడిగితే అన్నీ నిబంధనల ప్రకారమే చేశామని సెలవిస్తున్నారు. ఓ ఇంజినీర్ ఆరేళ్లుగా పాడేరులో విధులు నిర్వర్తిస్తున్నారు. జీవో 75 ప్రకారం ఏజెన్సీలో రెండేళ్లు పని చేసిన ఎవరైనా వారు కోరిన చోటుకు బదిలీ చేయాలి. అయితే పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఆ నిబంధనను తుంగలో తొక్కి ఆ ఇంజినీర్‌కు రిటన్షన్ ఇచ్చి పాడేరులోనే మగ్గిపోయేలా చేశారు. అలాగే శ్రీకాకుళంలో పని చేయాల్సిన ఒక అధికారి ఓడీ పేరుతో ఎంచక్కా విశాఖలో పనిచేస్తున్నారు. ఏసీబీ కేసు ఉన్న వ్యక్తికి ఉన్నత స్థానం కేటాయింపుపై కూడా విమర్శలు వస్తున్నాయి. అలాగే ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడికి బదిలీపై వెళ్లాల్సిన ఉద్యోగులు ఇక్కడికి దగ్గరలో ఉన్న అనకాపల్లికి చాకచక్యంగా బదిలీ చేయించుకుంటున్నారు. ఈ వ్యవహారంలో ఎమ్మెల్యే సిఫార్సులు ముఖ్యభూమిక పోషిస్తున్నాయి. దీనిని బూచిగా చూపి కొందరు ఉద్యోగులు తెలివిగా నచ్చిన చోటుకు బదిలీలు చేయించుకుంటున్నారు. జీవోను ఉల్లంఘిస్తూ, అక్రమంగా జరిగిన ఈ బదిలీలను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని బాధిత ఉద్యోగులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ కమిషనర్, మూడు జిల్లాల కలెక్టర్లు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ అక్రమాలపై డిప్యూటీ సీఎం, కమిషనరేట్, ప్రిన్సిపల్ సెక్రటరీకి కూడా ఫిర్యాదులు వెళ్లినట్టు తెలిసింది.

వర్షాల ధాటికి కూలిన 18వ శతాబ్దం నాటి ఇల్లు



అంబుసరంగు వీధిలో కూలిన ఇల్లు

డాబాగార్డెన్స్ : పాతనగరంలో 18వ శతాబ్దం నాటి ఇల్లు కూలింది. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పాతనగరంలోని అంబుసరంగు వీధిలో గల పురాతన ఇంటి గోడలు తడసి ముద్దయి ఆదివారం వేకువ జామున కూలింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. ఈ భవనం గత కొన్నేళ్లుగా శిథిలావస్థలో ఉంది. అయినప్పటికీ ఆ ఇంటి మీదుగానే వెనుక భాగాన ఉన్న పలు ఇళ్లకున్న దారిలో పలువురు రాకపోకలు సాగించేవారు. వేకువ జాము కావడంతో ఎవరూ అటుగా నడవలేదు. దీంతో ప్రమాదం తప్పినట్టయింది. ఇలాంటి ఇళ్లు పాతనగరంలో కోకొల్లలు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న ఇటువంటి ఇళ్లపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ప్రమాదాలు సంభవించక ముందే చర్యలు చేపట్టాలంటున్నారు.

త్వరితగతిన విద్యుత్తు పునరుద్ధరణ పనులు

- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

సాక్షి, విశాఖపట్నం : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఏపీఈపీడీసీఎల్ పరిధిలో దెబ్బతిన్న విద్యుత్తు సరఫరా వ్యవస్థను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో ఎప్పటికప్పుడు అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ త్వరితగతిన పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకొంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు, సెల్ టవర్లకు, అత్యవసర సర్వీసులు అందించే ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు. ఈ చర్యల్లో భాగంగా అన్ని సెక్షన్ కార్యాలయాలకు జనరేటర్లు, పోల్ డ్రిల్లింగ్ యంత్రాలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, అవసరమైన సామగ్రి, సిబ్బందిని అందుబాటులో ఉంచడం ద్వారా పునరుద్ధరణ చర్యలను త్వరితగతిన చేపట్టగలిగామని వివరించారు. వర్షాల కారణంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 5 సర్కిళ్లలోని 9 మండలాలు, 60 గ్రామాల్లో 3,299 సర్వీసు కనెక్షన్లకు, 56 వ్యవసాయ సర్వీసు కనెక్షన్లకు విద్యుత్తు అంతరాయం ఏర్పడింది. ఈ పనుల్ని యుద్ధప్రాతిపదికన సరిచేసినట్లు తెలిపారు. వినియోగదారుల నుంచి టోల్ ఫ్రీ నెంబరు 1912కు, కంట్రోల్ రూమ్ నెంబర్లకు 2583 ఫిర్యాదులు రాగా వాటిని క్షేత్రస్థాయి సిబ్బందికి త్వరితగతిన తెలియజేశామనీ.. వీటిలో కేవలం ఒక్క రోజులోనే 2175 ఫిర్యాదులను పరిష్కారించగలిగామన్నారు. డైరెక్టర్ ఆపరేషన్స్ విజయలలిత నేతృత్వంలో సీజీఎం ప్రాజెక్ట్స్ టీవీఎస్ఎన్ మూర్తిని విజయనగరం సర్కిల్‌కు, జనరల్ మేనేజర్లు జి.ప్రసాద్, ఎల్.దైవప్రసాద్‌లను శ్రీకాకుళం సర్కిల్‌కు నోడల్ ఆఫీసర్లుగా నియమించామని తెలిపారు. సంస్థ పరిధిలోని 5 సర్కిళ్లలో 365 మందితో 32 ప్రత్యేక బృందాలుగా నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. సంస్థ పరిధిలోని 5 సర్కిళ్లలో ఇప్పటివరకు గుర్తించిన సమాచారం మేరకు 9 మండలాలకు 9, 60 గ్రామాలకు 60, 3,299 సర్వీసు కనెక్షన్లకు 3,251, 33కెవి ఫీడర్లు 14 కి 14, 11 కేవీ ఫీడర్లు 100కి 100, 11కెవి స్తంభాలు 67కి 58, ఎల్‌టి స్తంభాలు 78కి 70, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 26కి 20, వ్యవసాయ కనెక్షన్లు 56కి 42 సర్వీసులను పునరుద్ధరించినట్లు సీఎండీ వెల్లడించారు. విద్యుత్ అంతరాయం సమాచారం కోసం టోల్ ఫ్రీ నెం. 1912కు, కార్పొరేట్ ఆఫీసు 9440816373, శ్రీకాకుళం 9490612633, పలాస 7382585630, టెక్కలి 7095875259, విజయనగరం 9490610102, విశాఖపట్నం 7382299975, రాజమండ్రి 7382299960, ఏలూరు 9440902926 నంబర్లకు సంప్రదించవచ్చన్నారు.